క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని టీఎన్‌జీవోస్ సంఘ భవనంలో బెస్ట్‌ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సమాజ సేవలో ప్రతిఒక్కరూ ముందుండాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అజీజ్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మనీషా, పవన్, సాజిదొద్దీన్, అజర్‌ఖాన్, దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

సమావేశం విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 8న జిల్లా కేంద్రంలో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రఫుల్‌చందర్‌రెడ్డి, చంద్రమోహన్‌లు కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. డైట్ కళాశాల మైదానంలో సమావేశం ఉంటుందన్నారు.

ఆయిల్‌పాం తోటల సందర్శన

బోథ్: మండల కేంద్రానికి చెందిన రైతులు భద్రాద్రి జిల్లాలోని అశ్వరావ్‌పేట, అప్పారావ్‌పేటలో ఆయిల్‌పాం తోటలను శుక్రవారం పరిశీలించారు. పంటల సాగు విధానం, గెలల నుంచి ఆయిల్ తయారీ విధానం, లాభాలు వంటి అంశాలపై అక్కడి రైతులతో మాట్లాడారు. అలాగే నూనెగింజెల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య ఆయిల్ ఫ్యాక్టరీని సందర్శించారు. కార్యక్రమంలో రైతులు బొడ్డు శ్రీనివాస్, కోల శ్రీకాంత్, మంచికుంట సంతోష్, సూది నరేష్, అల్లకొండ ప్రశాంత్, కుమ్మరి రాజు, కదం సుక్రుత్, రాసం ప్రవీణ్‌కుమార్, వంజరి రాజారాం పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవాలి

ఉట్నూర్‌రూరల్: యువత సన్మార్గంలో నడవాలని సద్గురు ప్రేంసింగ్ మహరాజ్ అన్నారు. మండలంలోని హీరాపూర్ తండాలో ఆయన పాల్గొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈనెల 11న గురు మిలన్ దివస్‌కు సేవాలాల్ భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అజయ్‌నాయక్, ధర్మునాయక్, ఉపేందర్, గోకుల్‌దాస్, దేవిదాస్, గణపతి పాల్గొన్నారు.

మన ఊరు.. మన బడితో అభివృద్ధి

ఇంద్రవెల్లి: మన ఊరు.. మన బడితో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్ కోరెంగా గాంధారి, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, తహసీల్దార్ ముంజం సోము, ఎంఈవో నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. శుక్రవారం నేరడిగొండ 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఎదులాపురం: ఉట్నూర్ మండల పరిధిలోని శాంపూర్ గ్రామంలో బీసీ కులానికి చెందిన యువకుడు దళిత యువకుడిని అగౌరవ పరుస్తూ మాట్లాడాడని అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, కేసు నమోదు చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ కుమార్ అన్నారు. ఇందులో నక్క రాందాస్, కత్తి గంగాధర్, లింగంపల్లి ప్రసన్నకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఎదులాపురం: తపస్ 2023 క్యాలెండర్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆవిష్కరించారు. విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందించేలా రూపొందించడం అభినందనీయమన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, వలభోజు గోపికృష్ణ, బచ్చు నారాయణ, చంద్ర శేఖర్, ముండే, దేవిదాస్, కేశవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీ నియంత్రణకు కృషి

ఆదిలాబాద్‌టౌన్: టీబీ నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా టీబీ నియంత్రణ అధికారి శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలో గల కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

టమాటా రైతుల విలవిల

- పడిపోయిన ధర
- పెట్టుబడి, కూలీల ఖర్చులు సైతం రావడం లేదని ఆవేదన



గుడిహత్నూర్‌లో సాగు చేస్తున్న టమాటా

గుడిహత్నూర్: టమాటా ధర పాతాళానికి పడిపోయింది. నెల రోజుల క్రితం వరకు ఉన్న ధర పూర్తిగా పడిపోవడంతో టమాటా రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం కూలీల ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు. ఒకానొక సందర్భంలో పంట చేతికి వచ్చినా తీసుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు టమాటా సాగు నేర్పిన ఘనత మండల రైతులకు ఉంది. మూడు దశాబ్దాల క్రితం మొదటిసారిగా మండలంలోని టాకీగూడకు చెందిన రైతు నర్వటే భీంరావ్ పటేల్ ఔరంగాబాద్‌లో తమ బంధువులు సాగు చేస్తున్న టమాటా పంటను చూసి అదే పద్ధతిలో సాగు చేసి జిల్లా రైతులకు సాగు విధానాన్ని పరిచయం చేశాడు. ఆనాటి నుంచి మండల రైతులు అధిక సంఖ్యలో ప్రతీ ఏటా ఖరీఫ్‌లో స్టెకింగ్ విధానంలో టమాటా సాగు చేసి, ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు పత్తి, సోయా, కందితో పాటు టమాటా సాగు చేస్తున్నారు. ఈఏడాది సుమారు 250 ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నారు. ప్రారంభంలో మంచి ధర పలికిన పంట ఇప్పుడు పాతాళానికి పడిపోయింది. నవంబరులో రూ.300 నుంచి రూ.600 పలికిన క్రేటు (25 కిలోల పెట్టె) ధర ఇప్పుడు కేవలం రూ.60 నుంచి రూ.90 మాత్రమే పలుకుతోంది. దీంతో కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమ్మే వారికే లాభం..

ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఒర్చి కష్టపడి పంట సాగు చేసి మార్కెట్‌కు తరలిస్తున్న రైతుకు నష్టాలే మిగులుతున్నాయి. ఇదే క్రమంలో పంటను కొనుగోలు చేసి అమ్ముతున్న దళారులు, రిటైల్ వ్యాపారులు మాత్రం సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాట కిలో ధర రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది. కానీ దీనిని పండించిన రైతుకు రూ.2 నుంచి రూ.4 మాత్రమే చేతికందుతున్నాయి. కూలీ ఖర్చులు సైతం భరించాల్సి ఉంటుంది.

టమాటా ఆధారిత పరిశ్రమల లేక నష్టాలు..

మండలంలో వందలాది ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్న రైతుకు సరైన మార్కెట్ సౌకర్యం లేని కారణంగా ఆశించిన స్థాయిలో ధర లభించడం లేదు. ఇదే కాకుండా భారీస్థాయిలో టమాటా దిగుబడులు ఉన్నప్పటికీ టమాటా ఆధారిత పరిశ్రమలు లేని కారణంగా కనీసం గిట్టుబాటు ధర కూడా అందడం లేదు. ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు టమాట పౌడర్, టమాటా పల్ప్, తదితర ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి టమాటా రైతులకు శాశ్వత భరోసా ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఖర్చులు కూడా రావడం లేదు



రోజు 60 క్రేట్ల టమాటా మార్కెట్ తరలించా. రూ.3800 వచ్చాయి. టమాటా తెంపిన కూలీలకు రూ.1250 పోను రూ.2550 మాత్రమే మిగిలాయి. ఇందులో రవాణా చార్జీలు, పెట్టుబడులు పోతే మిగిలేది ఏమీ ఉండదు. టమాటా ఆధారిత పరిశ్రమలు ఉంటే ఏడాదంతా లాభాలు పొందే అవకాశం ఉంటుంది.

– సాతాశే వినోద్, యువ రైతు గుడిహత్నూర్

స్కీమ్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి

ఇచ్చోడ: స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ. 16 వేలు చెల్లించాలని సీఐటీయూసీ జిల్లా కార్యదర్శులు సురేందర్, జితేందర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆశవర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఆశోక్, రాజేశ్వర్, సిరిసిల్ల భూమన్న, దుబాక సుభాష్, లక్ష్మి, గంగామణి, సాగరిక పాల్గొన్నారు.



ఇచ్చోడ: ఆందోళన చేస్తున్న స్కీమ్ వర్కర్లు



తాంసి: వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించాలి

తాంసి: ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే వివిధ స్కీమ్‌లలో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సమస్యలు వెంటనే పరిష్కరించాలని భీంపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, లత, మయూరి పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు సమస్యలను పరిష్కారించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, అంగన్‌వాడీ టీచర్లు వితబాయ్, విజయ, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.

నార్నూర్: స్కీమ్‌ల ప్రైవేటీకరణ ఆపాలని అంగన్‌వాడీ టీచర్లు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శుక్రవారం నిరసనకు దిగారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొట్నాక్ సక్కు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు అవుతున్నా.. స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరం కాలేదన్నారు. స్కీమ్‌లకు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలన్నా రు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి సునీత, నాయకురాలు పంచశీల, పంచపూల, మల్లు, చంద్రకళ, సంగీత, చంచెల పాల్గొన్నారు.



నార్నూర్: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు

బేల: స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కోశాధికారి మల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీమ్ వర్కర్ల సమస్యలపై నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ వామన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగన్న, సునీత, పద్మ, విశాఖ, అంగన్‌వాడీ ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: గ్రామాల్లో ప్రజలకు సేవలు అందించడం కోసం ఏర్పాటు చేసిన స్కీమ్‌ల ప్రవేటీకరణను ఆపాలని టీఏవీఎస్ రాష్ట్ర కార్యదర్శి పుసం సచిన్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఏవీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉయిక విష్ణు, సీఐటీయూ మండల నాయకులు సుభద్ర, భగీరథ, కుశవర్త, కల్యాణి, నాగుబాయి, కమల, రాజనర్సు, సులోచన, సంగీత, అనుసూయ పాల్గొన్నారు.

టీఎల్‌ఎంతో బోధన సులువు

తాంసి: టీఎల్‌ఎంతో బోధన సులువు అవుతుందని భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్ అన్నారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని ధనోరా పాఠశాలలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాను సెక్టోరియల్ అధికారి నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు తయారుచేసిన పరికరాలను పరిశీలించారు. బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, సర్పంచ్ అజయ్, అనిల్, శ్రీకాంత్, హెచ్‌ఎంలు ప్రభాకర్, సంతోష్, శంకర్, శిల్ప, శివారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.



మేళాను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సుధాకర్

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

తలమడుగు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శుక్రవారం మండలంలోని పల్సి(బి)తండాలో నారాయణ బాబా 27వ అఖండ హరినామ మహాయజ్ఞం నిర్వహించారు. ఎంత బిజీగా ఉన్నా.. దైవరాధన చేయాలని సూచించారు. మారుమూల గ్రామంలో జన్మించి అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. యజ్ఞంతో భక్తిభావం పెరుగుతుందన్నారు. కుచులపూర్, ఆదిలాబాద్, లింగి, సుంకిడి, కోత్తూర్, మహారాష్ట్రలోని కిన్వాట్, మహోర్, మాడ్వి గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఉచిత వైద్య శిబిరం..

పల్సి(బి)తండాలో వైద్యులు వన్నెల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆర్డీవో రమేష్ రాథోడ్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, వైద్యులు, వన్నెల అశోక్, బలరాం జాదవ్, మొట్టె కిరణ్ కుమార్, వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

11న మండల సర్వసభ్య సమావేశం

ఇచ్చోడ: ఈనెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అధ్యక్షతను ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. మండలస్థాయి అధికారులు తమ శాఖల ప్రగతినివేదికలతో హాజరు కావాలని కోరారు.

క్రీడల్లో రాణించాలి

ఇంద్రవెల్లి: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై సునీల్ అన్నారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌లో పిప్రి గ్రామం యూత్ సభ్యులకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. యువతను పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సహిస్తామన్నారు. ఏఎస్సై భీంరావ్, పోలీసు సిబ్బంది, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం

ఎదులాపురం: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని స్థానిక టీఎన్జీవోస్ హాల్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంద ఆశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల నవీన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 22 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆత్మారాం పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

నేరడిగొండ: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఓఎస్‌డీ ఉమా మహేశ్వర్ రావు, ఇచ్చోడ సీఐ నైలు అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని లింగట్ల గ్రామంలో శుక్రవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. రూ.1లక్ష 50 వేల విలువ గల కలప, కలప కటింగ్ యంత్రాలు, సరైన పత్రాలు లేని బైక్‌లను సీజ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, ఎక్సైజ్ సీఐ రాజామౌళి, ఎఫ్‌ఆర్‌వో గణేష్, ఎస్సైలు సాయన్న, ఉదయ్‌కుమార్, ప్రవీణ్, మహేందర్, రవీందర్, ఏఎస్సైలు మారుతి, కాత్లే రమేష్ పాల్గొన్నారు.



కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా పలువురు దుకాణ యజమానులకు కోట్పా చట్టంపై అవగాహన కల్పించారు. బహిరంగ ధూమపానం నేరం, పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్మోకింగ్ పాయింట్లు తొలగించాలని సూచించారు. అనంతరం చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తికి వన్‌టౌన్ ఎస్సై హరిబాబు సమక్షంలో జరిమానా విధించారు. ఆయన వెంట పొగాకు నియంత్రణ విభాగం సామాజిక కార్యకర్త చిరంజీవి ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీకాంత్

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా వంతెన



తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామ సమీపంలోని వాగుపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై ఉన్న సైడ్ రెయిలింగ్ ఒక వైపు కూలిపోయింది. దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సైడ్ రెయిలింగ్‌కు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: నరేష్‌కుమార్, ఏఈ ఆర్‌అండ్‌బీ, ఫోన్: 94408 19088

బస్టాండ్ పునరుద్ధరణ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

జైనథ్: బస్టాండ్ పునరుద్ధరణ పనులను అధికారులు ప్రారంభించారు. ఈనెల 14న ఆదిలాబాద్ జిల్లా ఎడిషన్‌లో 'బస్టాండ్‌లో వసతులేవి?' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. జైనథ్–బేల అంతరాష్ట్రీయ రహదారిపై నెలకొన్న సమస్యలు, బస్టాండ్ నిరుపయోగం మారిన తీరుపై దృష్టి సారించారు. ప్రస్తుతం బస్టాండ్‌కు రంగులు వేస్తుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బస్టాండ్‌కు వేసిన సున్నం

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

బజార్‌హత్నూర్: 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొంగర్ల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాపూర్, దిగ్నూర్, దేగామ, మంజరంతండా, టెంబి, చందునాయక్‌తండా గ్రామాల్లో బూత్ కమిటీల సభ్యుల పనితీరును పరిశీలించారు. ఈనెల 7న ఇచ్చోడలో జేపీ నడ్డా వర్చువల్ మీటింగ్‌కు బూత్ కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ రావ్ ఆమ్టే, బత్తిని సుధాకర్ యాదవ్, ఎంపీపీ అజాడే జయశ్రీ, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, సర్పంచ్ ఆడే శ్రీరాం, కేవల్‌సింగ్, పెరుగు సంతోష్, నారడి లింగన్న, ఆడే సంతోష్, జాడే బలిరాం, మధుకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొంగర్ల సత్యనారాయణ

పేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

తాంసి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి అందజేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, సర్పంచ్‌లు సదానంద్, గజానన్, యశ్వంత్, శ్రీధర్‌రెడ్డి, భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాథోడ్ మోహన్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, ముఖరా (బి) ఎంపీటీసీ గాడ్గే సుభాష్, ఇచ్చోడ సర్పంచ్ జాహెద్, సునీత, అహ్మద్, రాథోడ్ ప్రవీణ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



తాంసి: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

సంక్షిప్త వార్తలు

మంత్రిని కలిసిన నాగారెడ్డి

తాంసి: మండల బీఆర్‌ఎస్ రైతు సంఘం నాయకుడు సామ నాగారెడ్డి శుక్రవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి మండల సమస్యలు వివరించారు.

మార్కెట్ చైర్మన్‌ను కలిసిన గ్రామస్తులు

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్‌సింగ్‌ను మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకాలోని సింగర్‌వాడి గ్రామస్తులు శుక్రవారం కలిశారు. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. సింగర్‌వాడి సర్పంచ్ దాతారాం మారుతి, సాహెబ్‌రావ్, గాదం మదర్, గణపతి, చందోడి, రామోజీ మారుతి, నారాయణ, విష్ణు, నాందేవ్ పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డిని కలిసిన నాయకులు

జైనథ్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జైనథ్ మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జైనథ్ మీదుగా పాదయాత్ర ఉండేటట్లు చూడాలని కోరారు. అనంతరం స్వామి వారి ఫొటోను బహుకరించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి యాదవ్, అల్లూరి అశోక్ రెడ్డి, సయ్యద్ షాబీర్, నారకట్ల వెంకన్న, రెంజర్ల రాజన్న, లింగన్న, శివానంద్ పాల్గొన్నారు.

చిన్న గ్రామాలను పంచాయతీలుగా మార్చాలి

బోథ్: రాష్ట్రంలో చిన్న గ్రామాలను పంచాయతీలుగా మార్చాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న పంచాయతీ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసగించారు. రైతువేదికల ఏర్పాటు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలపై ప్రసంగించారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

బోథ్: ప్రతిఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఆధార్ సెంటర్ నిర్వహకుడు బాదల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోట (కె) గ్రామంలో ఆధార్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌ఐగా యజువేందర్ రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా యజువేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సిరికొండ మండలంలో పనిచేసిన ఆయనను ఆదిలాబాద్ అర్బన్ మండలానికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

సన్మానం

తాంసి: జిల్లా ట్రెజరీ డీడీగా బాధ్యతలు స్వీకరించిన భీంపూర్ మండల కేంద్రానికి చెందిన రమేష్ జాదవ్‌ను గ్రామస్తులు సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ట్రెజరీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ లింబాజీ, గ్రామస్తులు సత్కారించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ పాండ్‌రంగ్, పురుషోత్తం, నారాయణ పాల్గొన్నారు.

పరామర్శ

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా.. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి శుక్రవారం పరామర్శించారు.

ఆలయ వార్షికోత్సవం

బోథ్: మండల కేంద్రంలో సుబ్రమణ్యస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, మహిళలు మార్కండేయ ఆలయం వరకు శోభాయాత్రగా వెళ్లి సుబ్రమణ్య స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.